

మంత్రి తుమ్మలను కలిసిన గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, వంటిమామిడి, కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్లు

త్వరలోనే గజ్వేల్‌కు వస్తా

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

గజ్వేల్, మే 1 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే గజ్వేల్‌కు వస్తానని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలసి కొండపాక మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి, వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ భాగనోళ్ల విజయ మోహన్ మర్యాదపూర్వకంగా మంత్రిని గురువారం కలిశారు. ఈ సందర్భంగా గజ్వేల్‌కు రావాలని నర్సారెడ్డి మంత్రి తుమ్మలను ఆహ్వానించారు. ఈ నెల 10లోపు వస్తానని ఆయన హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ పాలకవర్గాల సన్మానంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు నర్సారెడ్డి తెలిపారు. అనంతరం నూతనంగా నియామకమైన మార్కెట్ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, మోహన్, వైస్‌చైర్మన్ ప్రభాకర్‌గుప్తా మంత్రికి కృతజ్ఞతలు తెలిపి, పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. వారితో నాయకులు సాజిద్‌బేగ్, రాజేశ్వర్‌గుప్తా, సురేష్ తదితరులున్నారు.

మహిళా క్లినిక్‌లపై

అవగాహన పెంచాలి

- సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి
- సమయానికి చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు అందించాలి
- డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్



అధికారులతో మాట్లాడుతున్న రవీందర్ నాయక్

నంగునూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): మహిళా క్లినిక్‌లలో అందిస్తున్న తల్లిబిడ్డల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన పెంచాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ సూచించారు. గురువారం నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పేద ప్రజల కోసం ఉండే స్థలాలని అక్కడికి వచ్చే రోగులతో సిబ్బంది ప్రేమగా మాట్లాడి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసాద సంఖ్యను పెంచాలన్నారు. పేద ప్రజలను ఆస్పత్రి తరలించేందుకు ప్రభుత్వం కల్పించిన 102 వాహనాలను సద్వినియోగం చేసుకునేలా ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకోవాలన్నారు. అంతకు ముందు స్టోర్‌రూం, ల్యాబ్ గదులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పల్వన్‌కుమార్ డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ రేవతి, డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆనంద్, డాక్టర్ నారాయణరావు, డాక్టర్ అరుణ్ కుమార్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ సరిత, హెచ్‌ఈవో స్వామి, సీహెచ్‌వో శ్రీనివాస్, ఎల్‌టీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై

అప్రమత్తంగా ఉండాలి

ములుగు, మే 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ములుగు ఏఎస్‌ఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మండలంలోని వంటిమామిడి గ్రామంలో గురువారం షీ టీం సభ్యులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. సోషల్ మీడియాలోని మోసపూరిత ప్రకటనలను నమ్మవద్దన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి ఇతర మత్తు పదార్థాలపై దూరంగా ఉండాలని హెచ్చరించారు. వేధింపులపై మహిళలు డయల్ 100కు లేదా సిద్దిపేట కమిషనరేట్ షీటీం నంబర్ 8712667434కు సమాచారం అందించాలని సూచించారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు

నోటిఫికేషన్ విడుదల

- అర్హులైన యువకులు దరఖాస్తు చేసుకోవాలి : కలెక్టర్

సిద్దిపేట కలెక్టరేట్, మే 1(ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని, జిల్లాలో ఆసక్తి గల యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి గురువారం ప్రకటనలో తెలిపారు. 1జనవరి 2005 నుంచి 1 జూలై 2008 మధ్య జన్మించి, 10వ తరగతి పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు మే 11లోగా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిజికల్ టెస్ట్, ప్రావీణ్య పరీక్ష, రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారని ఆయన పేర్కొన్నారు. ఎయిర్మెన్ సెలక్షన్ బెంగళూర్(కర్నాటక)లో ఉంటుందని, ఇతర వివరాలకు 09511947457 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

సమ్మర్ క్యాంపును ప్రారంభించిన నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి అర్బన్, మే1 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాకేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన క్రీడల సమ్మర్ కోచింగ్ క్యాంపును గురువారం టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యానికి దోహదపడుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. క్రీడల్లో నైపుణ్యం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. అనంతరం క్రీడలు ఆడి సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో ఖాసీం బేగ్, ఏఎంసీ వైస్ చైర్మన్ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కూన సంతోశ్, ఆర్‌టీఏ మెంబర్ తహెర్, కుతుబ్, నాగరాజు, మాణ్య, రాధాకృష్ణ చందర్, క్రీడల కోచ్‌లు రింకు, విజయ్, సామెల్, క్రీడాకారులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో హ్యాండ్‌బాల్ విసిరి సమ్మర్ కోచింగ్ క్యాంపును ప్రారంభిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి



సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొన్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, క్రీడాకారులు

రెవెన్యూ లీలలు

- రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని కమర్షియల్ భవనాల నిర్మాణం
- వాటికి ఆస్తి పన్ను విధించడంలో పలువురు మున్సిపల్ సిబ్బంది చేతివాటం
- షాపింగ్ మాల్, రెస్టారెంట్ భవనాలే టార్గెట్.. మున్సిపల్‌లోని ఓ రెవెన్యూ అధికారి కీలకపాత్ర
- డబ్బు తీసుకుని ఆస్తిపన్ను తక్కువ చేస్తున్న వైనం



సిద్దిపేట ఆంధ్రజ్యోతి, మే 1: దేశ, రాష్ట్రస్థాయిలో పలు విభాగాల్లో మంచి స్థానం సంపాదించుకుని ఎన్నో అవార్డులను కైవసం చేసుకుని, ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట మున్సిపల్‌కు అవినీతి గ్రహణం పట్టుకుంది. ఉత్తమ మున్సిపల్ పేరొందిన సిద్దిపేటను, అదే స్ఫూర్తితో బాధ్యతాయుతంగా అన్నింటా ముందుకు తీసుకెళ్లాల్సిన పలువురు అధికారులు, సిబ్బంది చేతివాటానికి పాల్పడుతున్నారు. ఏకంగా ఉన్నతాధికారులను సైతం పక్కదారి పట్టించేలా మున్సిపల్‌లోని ఓ రెవెన్యూ అధికారి కీలకపాత్ర వహిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తుంది. ప్రధాన ఆదాయ వనరులైన ఆస్తిపన్ను విషయంలో మున్సిపల్‌కు ఆదాయం పెంచాల్సింది పోయి, డబ్బు కోసం కక్కుర్తి పడుతూ ఖజానాకు గండికొట్టేలా వ్యవహరిస్తున్న తీరుపై అటు మున్సిపల్ కార్యాలయంలో, ఇటు పట్టణంలో తీవ్ర చర్చాంశనీయానికి దారితీస్తున్నది. ఫలితంగా సిద్దిపేట బ్రాండ్ ఇమేజ్‌కు తూట్లు పొడిచేలా వ్యవహరిస్తున్నట్లు ఏకంగా కౌన్సిల్ సభ్యులే ఆరోపిస్తుండటం పలు అనుమానాలను తావిస్తున్నది.

సిద్దిపేట మున్సిపల్ పరిధిలో

సిద్దిపేట మున్సిపల్ పరిధిలో మొత్తంగా 36,136 ఇళ్లు కాగా వీటిలో 28 వేలకు పైగా గృహ నిర్మాణాలు, 8వేలకు పైగా కమర్షియల్ భవనాలున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు నూతనంగా భవనాలను నిర్మించుకునేందుకు టీఎస్‌బీపాస్ కింద మున్సిపల్ అధికారులు 191 నూతన గృహ, కమర్షియల్ భవన నిర్మాణానికి అనుమతులు జారీచేశారు. వీటికి ప్రతి ఏడాది ఆస్తి పన్ను రూపేణ రూ.17.53 కోట్ల మేర మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారు.

ఆస్తిపన్ను పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్

సిద్దిపేట మున్సిపల్‌కు సంబంధించి ఆదాయ వనరులను పెంచేందుకుఅధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రధాన ఆదాయ వనరులైన ఆస్తిపన్నును సవరించేందుకు తిరిగి పరిశీలిస్తున్నారు. అందులో భాగంగానే గతంలో, ఇటీవల చేపట్టిన పెద్దపెద్ద భవనాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రెస్టారెంట్ బిల్డింగ్‌లు యజమానులు నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ నుంచి అనుమతులు పొందారు. ఇప్పుడు ఎలాంటి నిర్మాణాలు చేపట్టారోనని ఆరా తీస్తున్నారు. కొందరు గృహ భవనాల కోసం రెండు, మూడు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని ఇప్పుడు అంతకంటే ఎక్కువ నిర్మించారు. పలువురు గృహ నిర్మాణమని చెప్పి కమర్షియల్ భవనాలు నిర్మించినట్లు అధికారులు గుర్తించారు. అధికారులు గుర్తించిన వాటిలో గృహనికి సంబంధించి కొలతలు వేసి అనుమతి తీసుకున్న దాని కంటే ఎక్కువగా నిర్మాణం చేపట్టిన వారికి ఆస్తి పన్నును పెంచారు. మరోవైపు కమర్షియల్ కాంప్లెక్స్‌లలో కిరాయి పేరిట లక్షలు గడిస్తుండటం, ఆస్తి పన్ను మాత్రం తక్కువ మొత్తంలో చెల్లిస్తుండటంతో, మున్సిపల్ అధికారులు మున్సిపల్ ఆదాయాన్ని పెంచుకునేందుకు ఇలాంటి షాపింగ్ మాళ్లపై దృష్టిసారించారు.

మున్సిపల్‌లోని ఓ రెవెన్యూ అధికారి కీలకపాత్ర

ఈ వ్యవహారమంతా రెవెన్యూ విభాగానికి చెందిన ఓ అధికారి కనుసైగలో నడుస్తున్నట్లు తెలిసింది. ఇంటి నంబర్ కేటాయించాలన్నా, ఆస్తి పన్ను తక్కువ చేయాలన్నా, తదితర వాటికి ఆ అధికారి చేయి తడపనిదే ఫైల్ ముందుకు కదలని పరిస్థితి నెలకొన్నది. సదరు అధికారి తనకంటే పైస్థాయి అధికారులతో సన్నిహితంగా ఉంటూ తన పనిని సులువుగా చేసుకొని అక్రమంగా సంపాదిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా యజమానులను భయపెడుతూ రూ.లక్షల్లో అక్రమంగా సంపాదిస్తూ, మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులపై తక్షణమే విచారణ చేపట్టి సిద్దిపేట బ్రాండ్ ఇమేజ్‌ను, మున్సిపల్ పేరు చెదిరిపోకుండా కాపాడాలని పలువురు కౌన్సిల్ సభ్యులు కోరుతండండం, అధికారులు చేస్తున్న దోపిడికి నిదర్శనంగా నిలుస్తుంది.

రూ.లక్షల్లో ఆస్తి పన్ను పెరిగిందంటూ

సిద్దిపేట జిల్లా కేంద్రంగా మారిన తర్వాత అభివృద్ధి వైపు అడుగులు పడ్డాయి. అలాగే పట్టణంలో వ్యాపారం నిర్వహించుకునేందుకు పెద్దసంఖ్యలో షాపింగ్ మాల్స్ వచ్చాయి. ఒక్కసారిగా సిద్దిపేటలోని ప్రధాన రహదారుల్లోని కమర్షియల్ కాంప్లెక్స్‌లు, షాపింగ్‌కు అనుకూలంగా ఉండే పలు పెద్దపెద్ద భవనాలకు ఫుల్ డిమాండ్ పెరిగింది.

మిగతా 8లో..

ఏసీబీ వలలో

హోంగార్డు

- 8 వేల లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- మరో ఇద్దరు దుకాణాదారులపై కేసు

మిరుదొడ్డి, మే1 (ఆంధ్రజ్యోతి): హోంగార్డు లంచం తీసుకుంటూ గురువారం ఏసీబీకి పట్టుబడ్డాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ ద్విచక్రవాహనదారుడు ఇటీవల వ్యక్తిగత పనిమీద దుబ్బాక మున్సిపల్‌లోని లచ్చపేట వార్డుకు వచ్చి తిరిగి వెళ్తూ మిరుదొడ్డి శివారులో ఓ వాహనాన్ని ఢీకొట్టాడు. వారిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు హోంగార్డు సంతోష్‌గౌడ్ రూ.15వేలు లంచం డిమాండ్ చేశాడు. బాధితుడు రూ.10వేలు మాత్రమే ఉన్నాయని చెప్పగా తీసుకునేందుకు ఒప్పుకున్నాడు. అందులో రూ.2వేలు తనకు, రూ.3వేల చొప్పున హోటల్ నిర్వాహకుడు, మద్యం దుకాణ యజమానికి ఇవ్వాల్సిందిగా సూచించాడు. దీంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించాడు. ఈ మేరకు గురువారం లంచం తీసుకుంటున్న హోంగార్డును ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. హోటల్ నిర్వాహకుడు, మద్యం దుకాణ యజమానికి కూడా డబ్బు ఇస్తు న్న సమయంలో స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో ఎస్‌ఐ ప్రమేయంపై కూడా విచారణ చేపడుతున్నామని ఏసీబీ అధికారులు తెలిపారు.

ఎర్లీబర్డ్ పథకం

పొడిగింపు

దుబ్బాక, మే1(ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను వసూల్‌లో భాగంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ఎర్లీబర్డ్ ఇన్సెంటివ్ పథకాన్ని ఈ నెల 7 వరకు పొడిగించినట్టు దుబ్బాక మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ఆస్తిపన్ను వసుళ్లలో 5శాతం రాయితీని కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దుబ్బాకలోని రూ.2.69 కోట్లకు గాను రూ.29లక్షలు మాత్రమే వసూలైనట్లు తెలిపారు.

ముదిరిన ఎండలు

- ఉమ్మడి మెదక్ జిల్లాలో రెండు రోజులుగా మండుతున్న ఎండలు
- అక్కన్నపేట మండలంలోని కట్కూర్‌లో 43.7 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

కోహీర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎండలు రెండు రోజులుగా దంచికొడుతున్నాయి. సూర్యుడి ప్రతాపానికి ఉమ్మడి జిల్లా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో గురువారం సిద్దిపేట, మెదక్ జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో 43 డిగ్రీల కంటే ఎక్కువ.. 112 ప్రాంతాల్లో 40 డిగ్రీల కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని అక్కన్నపేట మండలంలో గల కట్కూర్‌లో 43.7 గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మెదక్ జిల్లాలోని వెల్దుర్తి మండలంలో గల దామరంచలో 43.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. అలాగే సంగారెడ్డి జిల్లాలోని సిర్గాపూర్ మండలంలోని కడ్పల్‌లో 42.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. మధ్యాహ్నం 12గంటల నుంచి 2గంటల మధ్య సమయంలో తీవ్రమైన వేడి గాలులతో, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మధ్యాహ్న సమయంలో ద్విచక్ర వాహనాలు రోడ్లపై కనిపించలేవు. అత్యవసరమైతే కార్లలో, బస్సుల్లో వెళ్లారు. జహీరాబాద్ నియోజకవర్గంలోని 65వ జాతీయ రహదారిపై మధ్యాహ్న సమయంలో వాహనాల రాకపోకలు తగ్గాయి. గురువారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నమోదైన ఉష్ణోగ్రత వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

సిద్దిపేట జిల్లాలో...

కట్కూర్‌లో 43.7 డిగ్రీలు, పోతరెడ్డిపేట 43.3, చిట్యాల 43.2, సముద్రాల 43.0, తుక్కాపూర్ 42.9, సిద్దిపేట 42.9, బెజ్జంకి 42.8, హుస్నాబాద్ 42.8, గండిపల్లి 42.8, అంగడికిష్టాపూర్ 42.7, రేబర్తి 42.5, బేగంపేట 42.4, శనిగరం 42.3, కోహెడ 42.1, అబ్బాపూర్ 42.0, పెద్దకోడూరు 41.9, మీరుదొడ్డి 41.8, దౌల్తాబాద్ 41.8, రాంపూర్ 41.8, చీకోడే 41.8, లకుడారం 41.7, వెంకట్రావుపేట, 41.5, తిప్పారం 41.5, దూల్మిట్ట 41.4, రాఘవపూర్ 41.1, గజ్వేల్ 41.0 నారాయణపేట్ 41.0, బేజుగావ్ 40.9, కొండపాక 40.9, ముస్త్యాల 40.8, మునిగడప 40.5, ములుగు 40.3 గౌరారం 40.3, ములుగు (ఎఫ్‌సీఆర్‌ఐ) 40.3, నంగనూరు 40.2 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మెదక్ జిల్లాలో...

దామరంచలో 43.3 డిగ్రీలు, చిట్కుల్ 43.0, నాగపూర్ 42.9, అల్లాదుర్గం 42.6, శివ్వంపేట 42.5, వడ్డీ 42.5, వెల్దుర్తి 42.3, టేక్మాల్ 42.3 నార్లపల్లి 42.2, కౌడిపల్లి 42.2, సర్దన 42.2, బుజ్జూరపేట 42.1, శంకరంపేట(ఎ) 42.0, నర్సాపూర్ 42.0, పొడ్చన్‌పల్లి 42.0 శంకరంపేట(ఆర్) 41.9, కుల్చారం 41.8, పాతూర్ 41.8, మెదక్ 41.8, మాసాయిపేట్ 41.7, చేగుట 41.7, కొత్తపేట 41.6, శివనూరు 41.5 కాగజ్‌మద్దూర్ 41.5, రేగోడు 41.5, రాజ్‌పల్లి 41.5, మినీపూర్ 41.1, లక్ష్మాపూర్ 41.0 మనోహరాబాద్ 40.8, చిప్పలుతుర్తి 40.8, దొంగలదర్మారం 40.7, ఇస్లాపూర్ 40.7, రామయంపేట 40.5, లింగాయపల్లి 40.3 ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

సంగారెడ్డి జిల్లాలో..

కడ్పల్‌లో 42.6 డిగ్రీలు, దిగ్వాల్ 42.5, నిజాంపేట్ 42.4, పల్వట్ల 42.4, జిన్నారం 42.3, లక్ష్మీసాగర్ 42.1, కల్హేర్ 42.0, వట్‌పల్లి 41.9, గుండ్లమాచనూరు 41.8, అన్నసాగర్ 41.8, కంది 41.8, రుద్రారం 41.7, అల్మాయిపేట్ 41.7, సిర్గాపూర్ 41.7, పుల్కల్ 41.6, జహీరాబాద్ 41.6, పటాన్‌చెరు 41.6, నాగలగిద్ద 41.5, నారాయణఖేడ్ 41.5, ముక్తాపూర్ 41.5, రామచంద్రపురం 41.5, కొండాపూర్ 41.5, రాయికోడు 41.5, చౌటకూర్ 41.4, పాశమైలారం 41.4, సత్వార్ 41.4, కంగ్టి 41.3, బీహెచ్‌ఈఎల్ 41.3, సుల్తాన్‌పూర్ 41.2, సంగారెడ్డి 41.2, మనూర్ 41.1, ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



చేర్యాలలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా మే డే

- పలుచోట్ల భారీ ర్యాలీలు, కార్మిక జెండాల ఎగురవేత

8

ఇక అమృత్ 2.0 తాగునీరు

- వచ్చే వేసవి నాటికి పట్టణాల్లో తాగునీటి సరఫరా
- మున్సిపాలిటీల్లో ఇంటింటికీ కుళాయి
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 29 ట్యాంకుల నిర్మాణం
- 2038 నాటికి అనుగుణంగా పథకం రూపకల్పన



7



వేసవి తాపం

ఈతతో ఉపశమనం

ఎండలు దంచి కొడుతున్నాయి.. పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. వేడి తాళలేక జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇక పిల్లలకు స్కూళ్లకు వేసవి సెలవులు ఇవ్వడంతో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువులో ట్యూబ్‌ల సాయంతో ఈత కొడుతున్నారు. ఏ మాత్రం ఏమరపాటు ఉన్న ప్రమాదం జరిగే అవకాశం లేకపో లేదు. వేసవి సెలవులలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

- జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్





అంతర్జాతీయ తైక్వాండోలో విహాన్‌రెడ్డికి బంగారు పతకం

నారాయణఖేడ్, మే 1 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్-2025లో పల్లోళ్ల విహాన్‌రెడ్డి బంగారు పతకాన్ని సాధించాడు. ఈ చాంపియన్ షిప్‌ను మలేషియా ప్రభుత్వం అక్కడి సెలాంగోర్‌లోని షాఆలమ్‌లో గురువారం నిర్వహించింది. విదేశీ గడ్డపై బంగారు పతాకాన్ని సాధించి భారతదేశం గర్వపడేలా చేశాడు. బంగారు పతకాన్ని సాధించడం పట్ల విహాన్‌రెడ్డి తల్లిదండ్రులు కుటుంబీకులు, కోచ్‌లు హర్షం వ్యక్తం చేశారు.



బంగారు పతకాన్ని సాధించిన విహాన్‌రెడ్డి

డీలక్స్ బస్సుల్లో పదిశాతం సబ్సిడీ

నారాయణఖేడ్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారికి టికెట్ చార్జీల్లో పదిశాతం సబ్సిడీ సౌకర్యం కల్పిస్తున్నట్లు బుధవారం స్థానిక డిపో మేనేజర్ మల్లేశయ్య తెలిపారు. నెలవారి టికెట్ పైన 20 రోజుల చార్జీతో 30 రోజులు ప్రయాణం చేసే సౌకర్యం ఆర్టీసీ కల్పించిందని, ఈ సదుపాయం ఈనెల 1 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఖేడ్ నుంచి జేబీఎస్‌కు రూ.210లు, ఖేడ్ నుంచి లింగంపల్లికి రూ.190, ఖేడ్ నుంచి సంగారెడ్డికి రూ.140లు చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఖేడ్ నుంచి సంగారెడ్డి వరకు గల స్టేజిలకు మంత్లీ టికెట్స్ ఇవ్వబోతున్నట్లు డీఎం వివరించారు.

భారీ బందోబస్తుతో నీట్‌పరీక్ష

పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల నిఘా

సంగారెడ్డి క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈనెల 4వ తేదీన (ఆదివారం) నీట్ పరీక్ష జరగబోతుంది. సంగారెడ్డిలోని ప్రభుత్వ జూనియర్‌కాలేజ్, సుల్తాన్‌పూర్‌లోని జెఎన్‌టియు, కందిలోని ఐఐటి హైదరాబాద్‌లో ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఈ పరీక్షా కేంద్రాలను గురువారం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సందర్శించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 125 బీఎన్‌ఎస్‌ఎస్ (144) సెక్షన్ అమలులో వుంటుందని, గుంపులు, గుంపులుగా తిరగొద్దని అన్నారు. అభ్యర్థులు, ఇన్విజిలేటర్లు ఎవరు కూడా ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావొద్దని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షణ వుంటుందన్నారు.

అభ్యర్థులకు సూచనలు

అభ్యర్థులు అడ్మిట్ కార్డ్‌తో పాటు గుర్తింపు కార్డు, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, పారదర్శకంగా/ ట్రాన్స్‌పరెంట్‌గా ఉండే వాటర్ బాటిల్ తీసుకొని రావాలని ఎస్పీ సూచించారు. బంగారు, వెండి తదితర నగలు వేసుకొని రాకూడదని, షూస్, సాక్స్ వేసుకొని రాకూడదని, పరీక్షా కేంద్రాలకు సకాలంలో హాజరు కావాలని అభ్యర్థులకు సూచనలు చేశారు. ఈ సందర్శనలో ఎస్పీ వెంట సంగారెడ్డి డియస్పీ సత్యయ్య గౌడ్, జోగిపేట్ సిఐ అనిల్ కుమార్, సంగారెడ్డి రూరల్ సీఐ క్రాంతి కుమార్ తదితరులు ఉన్నారు.


ఐఐటీ హైదరాబాద్‌లో పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ పంకజ్


సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ పంకజ్



ఎంపికైన నంగునూరు మండలం గట్ల మల్యాల విద్యార్థులు

రాష్ట్రస్థాయి క్రీడలకు గట్ల మల్యాల విద్యార్థులు ఎంపిక

నంగునూరు, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు నంగునూరు మండలం గట్ల మల్యాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం రమేశ్ తెలిపారు. ఏప్రిల్ 26న జడ్పీహెచ్ఎస్ గట్లమల్యాలో జరిగిన జూనియర్ సాఫ్ట్ బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో 8 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు ఏప్రిల్ 26 నుంచి మే 1 వరకు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులు ఈ నెల 2 నుంచి 4 వరకు జగిత్యాలలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

పోలీసు వాహనాల విడి భాగాల వేలం

సంగారెడ్డి క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పోలీసు వాహనాలకు వినియోగించిన, కాలం చెల్లిన విడిభాగాలను (టైర్ మరియు ట్యూబ్స్, బ్యాటరీలు, ఇతర వాహన విడి భాగాలు) ఈనెల 8న ఉదయం 10 గంటలకు జిల్లా పోలీసు ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో బహిరంగ వేలం వేయనున్నట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తెలిపారు. ఆసక్తి గల వారు ఈ వేలం పాటలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు 9908847637, 8179412752 నంబర్లను సంప్రదించాలని ఆయన సూచించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పని సరి

● సంగారెడ్డి జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ వసంతకుమారి

కంది, మే 1 (ఆంధ్రజ్యోతి) : పశువుల సంరక్షణ కోసం జాతీయ వ్యాధి నివారణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు అందరు తమ పశువులకు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ వసంతకుమారి అన్నారు. మండలకేంద్రమైన కందిలోని పశువైద్య కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. పశువైద్య కేంద్రంలో సరిపడా మందులు ఉన్నాయా అని ఆరా తీశారు. పశువులు, గేదెలు, గొర్రెలకు, మేకలకు, పెంపుడు జంతువులకు సకాలయంలో వైద్య సేవలు అదించాలని ఆదేశించారు. అనంతరం అక్కడి రికార్డులను పరిశీలించారు. పశువులకు మే 14వ తేదీవరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని, టీకాలు వేయించిన రైతుల, పశువుల వివరాలను 'భారత్ పశుదాన్' వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేయాలని కంది పశువైద్యాధికారి జీనత్‌బానుకు సూచించారు.


కందిలోని పశువైద్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధకశాఖ జేడీ వసంతకుమారి




చెరువులోకి కాలుష్య జలాలు

కొండాపూర్‌లోని మల్లేపల్లి బీరు పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్య జలాలు చెరువులోకి వదులుతున్నారు. వ్యర్థ జలాలు చెరువులోకి చేరడంతో పెద్ద పెద్ద చెట్లు ఎండిపోయి కనుమరుగవుతున్నాయి. చెరువు కట్టపై నుంచి వెళ్తున్న వారు దుర్బర కంపుతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

కొండాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి)

వివాహ వేడుకలో రిటర్న్ గిఫ్ట్‌గా భగవద్గీత





అతిథులకు భగవద్గీత అందజేస్తున్న వధూవరులు, తల్లిదండ్రులు


సిద్దిపేట కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : పెళ్లికి వెళ్తే బంధుమిత్రుల పలకరింపులు, విందు భోజనాలు, పెళ్లి సందడి, నమస్కారాలతో వీడ్కోలు ఉంటాయి. కానీ, సిద్దిపేటలో జరిగిన ఓ పెళ్లికి వచ్చిన బంధుమిత్రులకు రిటర్న్ గిఫ్ట్‌గా భగవద్గీత పుస్తకాలను బహూకరించారు. రెడ్డి ఫంక్షన్ హాల్‌లో గురువారం వల్లబోజు లత, బుచ్చిబాబు దంపతుల కూతురు చందన వివాహం హర్షవర్ధన్‌తో జరిగింది. ఈ సందర్భంగా సుమారు 500 మంది బంధువులు, మిత్రులకు భగవద్గీత పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హరే కృష్ణ ఇస్కాన్ సెంటర్ బాధ్యులు రంగ తీర్థ దాస్ ప్రభు తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికి హాజరైన కేసీఆర్ దంపతులు



వధూవరులతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు

మర్కుక్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ భాగ్యమ్మ, వెంకటేష్ దంపతుల కుమారుడు విష్ణువర్ధన్ వివాహం గురువారం గ్రామంలో జరిగింది. మాజీ ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ దంపతులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ రామచంద్రంను కేసీఆర్ ఆప్యాయంగా పలకరించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ బాల్‌రాజు, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గీసు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో నిర్మిస్తున్న 700కేఎల్ ఈఎల్ఎస్ఆర్

ఇక అమృత్ 2.0

వచ్చే వేసవి నాటికి పట్టణాల్లో తాగునీటి సరఫరాకు చర్యలు.. మున్సిపాలిటీల్లో ఇంటింటికీ కుళాయి ఏర్పాటు

ఉమ్మడి మెదక్ జిల్లాలో 29 ట్యాంకుల నిర్మాణం.. 2038 నాటి అవసరాలకు అనుగుణంగా పథకం రూపకల్పన

తూప్రాన్, మే 1(ఆంధ్రజ్యోతి) : రానున్న దశాబ్దన్నర కాలం.. అంటే 2038 నాటి జనాభాకు అనుగుణంగా పట్టణాల్లోని ప్రతీ ఇంటికి నల్లా (కుళ్లాయి)తో తాగునీరు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ 2.0 (అటల్ మిషన్ ఫర్ రిజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్‌మేషన్ 2.0) పథకం చేపట్టింది. వచ్చే వేసవి నాటికి పనులను పూర్తి చేసి తాగునీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2025-26 నాటికి ఎంపిక చేసిన 500 పట్టణాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. ఐదేళ్ల పథకంలో చివరి యేడాది ఉమ్మడి మెదక్ జిల్లాలో అమృత్ 2.0 అమలు చేస్తున్నారు. పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు మున్సిపాలిటీ(ఈఎల్‌డీ)ని భాగస్వామ్యం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఎంపిక చేసిన పట్టణాలు

అమృత్ పథకం కింద మెదక్ జిల్లాలో తూప్రాన్, మెదక్, నర్సాపూర్, రామాయంపేట మున్సిపాలిటీలను, సిద్దిపేట జిల్లాలో గజ్వేల్, సిద్దిపేట, చేర్యాల, సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, నారాయణఖేడ్, సదాశివపేట, నారాయణఖేడ్, జహీరాబాద్ పట్టణ మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. ఇప్పటికే కొన్ని మున్సిపాలిటీల్లో పనులు చేపట్టి నిర్వహిస్తుండగా, మరి కొన్ని మున్సిపాలిటీలలో ఇంకా ప్రారంభం కావల్సి ఉంది. వచ్చే ఏడాది వేసవి నాటికి పట్టణ ప్రజలకు ఇంటింటికీ తాగునీటిని సరఫరా చేసే దిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కాంట్రాక్టు పనులు నిర్వహిస్తున్న సంస్థ నిర్వహణ బాధ్యతలు ఐదేళ్లపాటు చేపట్టనుంది. పట్టణంలో ఆటంకాలు లేకుండా నీటిని సరఫరా చేసే విధంగా టెండర్‌లోనే నిబంధనలు పొందుపర్చారు.



తూప్రాన్ పట్టణంలో నీటి ట్యాంకు నిర్మాణ పనులు

మెదక్ జిల్లాలో ఆరు వాటర్ ట్యాంక్‌లు

మెదక్ జిల్లాలో అమృత్ 2.0 పథకం కింద ఆరు వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి, 48 కిలోమీటర్ల పొడవైన పైపులైన్ వేయనున్నారు. పట్టణాల్లోని ఇంటింటికి నల్లాలను బిగించనున్నారు. తూప్రాన్‌లో 12 లక్షల (9లక్షలు, 3లక్షలు) లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు భారీ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. తాగునీరు సరఫరా చేసేందుకు 15 కిలోమీటర్ల పొడవైన పైపులైను వేయనున్నారు. రూ.9 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. 1690(1.690 లక్షల లీటర్ల) కేఎల్ సామర్థ్యంతో వాటర్ ట్యాంకులు ఉండగా ప్రస్తుతం 3.60 ఎంఎల్‌డీ అవసరం ఉండగా 3.20 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేస్తున్నారు. నీటి ట్యాంకుల నిర్మాణం పూర్తయితే 5.0 ఎంఎల్‌డీ నీటిని సరఫరా చేయనున్నారు. నర్సాపూర్‌లో 13.50 (1350 కేఎల్) లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. రూ.12 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారు. మెదక్‌లో 30లక్షలు (3000 కేఎల్) లీటర్ల సామర్థ్యంతో రూ.30 కోట్లతో, రామాయంపేటలో 9 లక్షలు (900 కేఎల్) లీటర్ల సామర్థ్యంతో రూ.7కోట్లతో వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నారు.

సిద్దిపేట జిల్లాలో 11 వాటర్ ట్యాంక్‌లు

సిద్దిపేట జిల్లాలో అమృత్ 2.0 పథకం కింద 11 వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టి, 174 కిలోమీటర్ల పొడవైన పైపులైన్ వేయనున్నారు. సిద్దిపేటలో 62 లక్షల(6200 కేఎల్) లీటర్ల సామర్థ్యం కలిగిన ఐదు వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. చేస్తున్నారు. రూ.89.5 కోట్ల వ్యయంతో 130 కిలోమీటర్ల పైపులైన్ వేయనున్నారు. చేర్యాలలో 20 లక్షలు(2000 కేఎల్) లీటర్ల సామర్థ్యంతో రూ.13.5 కోట్ల వ్యయంతో మూడు వాటర్ ట్యాంకులను నిర్మిస్తున్నారు. ఇందులో 16 కిలోమీటర్ల పొడవైన పైపులైన్ వేస్తారు. గజ్వేల్‌లో రూ.28 కోట్లతో 27 లక్షలు (2700 కేఎల్) లీటర్ల సామర్థ్యం కలిగిన మూడు వాటర్ ట్యాంకుల నిర్మాణం చేస్తున్నారు. 48 కిలోమీటర్ల పొడవైన పైపులైన్ వేయనున్నారు.

సంగారెడ్డి జిల్లాలో 13 వాటర్ ట్యాంక్‌లు

సంగారెడ్డి జిల్లాలో అమృత్ 2.0 పథకం కింద 13 వాటర్ ట్యాంకులు, సంపుల నిర్మాణం చేపట్టి, 124 కిలోమీటర్ల పొడవైన పైపులైన్ వేయనున్నారు. సంగారెడ్డిలో రూ.44 కోట్లతో 5700 కేల్ కేపాసిటీ ఐదు ట్యాంకులు, సంపులను నిర్మిస్తున్నారు. ఇందులో 17 కిలోమీటర్ల గ్రావీటి, 34 కిలోమీటర్ల పొడవు డిస్ట్రిబ్యూటరీ పైపులైన్ వేస్తారు. సదాశివపేటలో రూ.8.5 కోట్లతో 1300 కేఎల్ కేపాసిటీతో మూడు ట్యాంకుల నిర్మాణంతోపాటు 9 కి.మీ.పైపులైన్ వేయనున్నారు. జహీరాబాద్‌లో రూ.66 కోట్లతో 1100 కేఎల్ సామర్థ్యంతో భారీ ట్యాంకు, 50కి.మీ.పైపులైన్ పనులను చేయనున్నారు. నారాయణ ఖేడ్‌లో రూ.13.5 కోట్లతో 1550 కేఎల్ సామర్థ్యం గల మూడు ట్యాంకులు, వెయ్యి కేఎల్ కెపాసిటీతో సంపును నిర్మించనున్నారు. ఇందులో 14కి.మీ. పైపులైన్ వేయాలి. కానీ, ఖేడ్‌లో ఇంకా పనులు ప్రారంభం కాలేవు.

మెదక్ జిల్లాలో ముందస్తు పన్ను వసూలు ₹2.84 కోట్లు

5 శాతం రాయితీని వినియోగించుకున్న 4,480 మంది

మెదక్ మున్సిపాలిటీ, మే 1 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలకు రూ.2.84 కోట్ల ఆదాయం ముందస్తు పన్ను చెల్లింపుల ద్వారా సమకూరింది. గత ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు ఎర్లిబర్డ్ స్కీంను ప్రకటిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ పథకం ద్వారా 2025-26వ సంవత్సరానికి సంబంధించి పన్నులను ముందస్తుగా చెల్లిస్తే 5 శాతం రాయితీ ప్రకటించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచే 30 వరకు ఎవరైతే పన్నులు చెల్లిస్తారో మొత్తంలో ఐదు శాతం రాయితీని పొందుతారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతో జిల్లాలోని రామాయంపేట, నర్సాపూర్, తూప్రాన్‌తో పాటు జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో రెవెన్యూ అధికారులు ఆటోల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టారు. అంతేగాకుండా ఇటీవలే వార్డులలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన వార్డు ఆఫీసర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రెవెన్యూ సిబ్బందితో కలిపి ఇంటింటికీ వెళ్లి వసూలు చేయించారు. దీంతో నాలుగు మున్సిపాలిటీల్లో సుమారు 20 శాతం వరకు ముందస్తు పన్ను వసూలు చేయగలిగారు.

ముందంజలో మెదక్ మున్సిపాలిటీ..

నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తంగా రూ.2.84 కోట్లు వసూలయ్యాయి. అందులో మెదక్ మున్సిపాలిటీ ముందుంది. మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 12,442 నివాస, నివాసేతర భవనాలుండగా వీటి ద్వారా ప్రతీ సంవత్సరం 4.64 కోట్ల రూపాయలు పన్ను వసూలు రావాల్సి ఉంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎర్లీబర్డ్ స్కీం ద్వారా ఏప్రిల్ మాసంలో 2,300 మంది పన్నులు చెల్లి 1.20 కోట్ల రూపాయలను పన్ను రూపేణ చెల్లించారు. తూప్రాన్ మున్సిపాలిటీలో 6,600 నివాస, నివాసేతర భవనాలుండగా వీటి ద్వారా రూ.2.75 కోట్ల పన్నులు రావాల్సి ఉంది. ఎర్లీబర్డ్ పథకం ద్వారా 760 మంది రూ.69 లక్షలు చెల్లించారు. నర్సాపూర్‌లో 4,556 నివాస, నివాసేతర భవనాల ద్వారా రూ.3.83 కోట్ల రావాల్సి ఉండగా 800 మంది నుంచి రూ.78.41 లక్షలు వసూలయ్యాయి. ఇక రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో 5,564 నివాస, నివాసేతర భవనాలు ఉండగా వీటి ద్వారా రూ.1.12 కోట్ల వరకు పన్ను రూపేణ రావాల్సి ఉంది. ముందస్తు రాయితీ కింద 620 మంది చెల్లించగా రూ.17 లక్షల ఆదాయం సమకూరింది. మొత్తంగా 4,480 మంది 5 శాతం రాయితీని వినియోగించుకుని పన్నులను చెల్లించారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మెదక్‌లో ఎక్కువగా వసూలయ్యాయి.



పన్ను వసూలు చేస్తున్న సిబ్బంది

నేటి నుంచి రేగోడు బ్రహ్మంగారి ఉత్సవాలు



బ్రహ్మంగారి మఠంలో ప్రతిష్ఠించనున్న దేవతామూర్తులు

రేగోడు మే1(ఆంధ్రజ్యోతి): రేగోడు బ్రహ్మంగారి మఠంలో శుక్రవారం నుంచి 75వ ఆరాధన ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని మఠం పూజారి శివకుమార్‌చారి తెలిపారు. మఠం ఆవరణలోనే సప్త దేవతల దర్శనం చేసుకునేల ఏర్పాట్లు చేశారు. ఈ నెల 3న బ్రహ్మంగారి, శరభాక లింగమయ్య ఆలయాలకు ధ్వజ స్తంభాలు, శిఖరాల ప్రతిష్ఠాపన, శరభాక లింగమయ్య విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్లు తెలిపారు. నూతనంగా సుబ్రహ్మణ్యస్వామి, కాలభైరవ స్వామి, ఈశ్వరీదేవి, దత్తాత్రేయల, ఆదిశంకరాచార్యులు, శివలింగం, నంది, ఒంటి నాగులు, జంట నాగులు, ఏడు శిరస్సుల నాగులు, బలిపీఠాలను ప్రతిష్ఠించనున్నట్లు అర్చకులు తెలిపారు. వీరబ్రహ్మేంద్ర శైవ గామ వేద సంస్కృత పాఠశాల నిర్వాహకులు అప్ప సముద్రం చంద్రశేఖరచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 4వ తేదీన బ్రహ్మంగారి, దుర్గమ్మదేవి బయలు నాటకాలను ఏర్పాటు చేశారు. 6న బ్రహ్మంగారి మఠం వద్ద పలహారబండ్లు, 8న రథోత్సవం, కుస్తీ పోటీలు నిర్వహిస్తునన్నారు.

బోరంచ నల్లపోచమ్మ జాతర ప్రారంభం

● ఆలయంపై దేవాదాయ శాఖ నిర్లక్ష్యం

మనూరు, మే 1(ఆంధ్రజ్యోతి): బోరంచ నల్లపోచమ్మ ఏడు వారాల జాతర గురువారం ప్రారంభమైంది. జూన్ 12 వరకు కొనసాగనున్నది. మంజీరా నది ఒడ్డున భక్తుల కొంగు బంగారంగా వెలసిన నల్ల పోచమ్మ అమ్మవారికి మొక్కులను సమర్పించుకోవడానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా దేవాదాయ శాఖ వసతులను కల్పించారు. పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. అయితే, ఏడు వారాల జాతరకు ఆలయ ముస్తాబులో దేవాదాయశాఖ నిర్లక్ష్యం వహించింది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరణ చేయలేదు. కనీసం ఆలయానికి రంగులను కూడా వేయించకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. అలయ సమీపంలో ఉన్న గుండంలో నీరు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ అధికారులు స్పందించి ఆలయాన్ని ముస్తాబు చేయాలని కోరుతున్నారు.



ఆలయానికి వేయని రంగులు

సమరత ర్యాలీ



జహీరాబాద్ పట్టణంలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో గురువారం సామాజిక సమరత యాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఆధ్యాత్మిక గురువులు ముందుగా అనుగ్రహ భాషణం చేశారు.

\- జహీరాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి)

వేర్వేరు కారణాలతో ఐదుగురి ఆత్మహత్య

- ఫ్లైఓవర్‌పై నుంచి దూకి ఒకరు
- డిగ్రీ ఫెయిల్ అవుతానని విద్యార్థిని
- ధూళిమిట్టలో నిప్పంటించుకుని మరొకరు
- అనారోగ్యంతో బాధపడుతూ వర్గల్‌లో ఇంకొకరు
- కుటుంబ కలహాలతో మంగాపూర్‌లో వ్యక్తి



దాచా నాగరాజు (ఫైల్)

వర్గల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనస్తాపానికి గురైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్గల్ మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకున్నది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. వర్గల్ గ్రామానికి చెందిన దాచా పాపయ్యకు ఇద్దరు కూమారులు, ఒక కూతరు ఉన్నారు. అందరి వివాహాలు జరిగాయి. కుమారుడు దాచా నాగరాజు(34)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంత కాలంగా నాగరాజు క్షయ వ్యాధితో బాధపడున్నాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురయ్యే వాడు. ఈ క్రమంలో గత బుధవారం నాగరాజు భార్య పిల్లలు తునికిఖాల్సాలో ఉంటున్న అత్తగారింటికి వెళ్లారు. ఇంటి పైఅంతస్తులో ఉంటున్న నాగరాజు గురువారం ఉదయం నైలాన్ తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నాగరాజు తండ్రి పాపయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హత్నూర మండలం మంగాపూర్‌లో..

హత్నూర, మే 1 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగాపూర్ గ్రామంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మంగాపూర్ గ్రామానికి చెందిన మాదారం దుర్గయ్య (36) అతని తమ్ముడు భాస్కర్ కుటుంబీకులు వేర్వేరుగా ఉంటున్నారు. అయినప్పటికీ తరచూ ఇరు కుటుంబీకుల మధ్య చిన్నచిన్న గొడవలు జరుగుతూ వస్తున్నాయి. బుధవారం దుర్గయ్య, భాస్కర్ కుటుంబాల మధ్య మాటమాట పెరిగి వాగ్వాదానికి దిగారు. దీంతో బుధవారం గ్రామ పెద్దలు కూర్చుని మాట్లాడి ఇరువురికి నచ్చజెప్పారు. గురువారం ఉదయం గ్రామ శివారులోని పొలం వద్ద దుర్గయ్య చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు, స్థానికులు అక్కడకు చేరుకొని పరిశీలించగా, అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుభాష్ తెలిపారు.



మాదారం దుర్గయ్య (ఫైల్)

బీహెచ్‌ఈఎల్‌లో..

రామచంద్రాపురం టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెందిన యువకుడు సంగారెడ్డి జిల్లాలోని బీహెచ్‌ఈఎల్ నూతన ఫ్లైఓవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటకకు చెందిన చంద్రప్ప(35) తెల్లాపూర్‌లో ఉంటూ కూలి పని చేసుకుంటు జీవిస్తున్నాడు. తన కుటుంబ సభ్యులు ఎవరితోనూ సంబంధాలు లేవు. ఒంటరి తనాన్ని భరించలేక గురువారం ఉదయం బీహెచ్‌ఈఎల్ ఫ్లైఓవర్‌పై నుంచి దూకాడు. తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందారు. అన్న అంజలప్ప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బైరాన్‌పల్లిలో యువకుడు..

ధూళిమిట్ట, మే 1 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్య చేసుకున్న యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం మండల పరిదిలో చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన యువకుడు ఇర్ఫాన్ (19) రెండు రోజులు క్రితం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆసుపత్రికి తరలించారు. ఇర్ఫాన్ చికిత్సపొందుతూ గురువారం ఆసుపత్రిలో మరణించాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ఇర్ఫాన్ (ఫైల్)

జోగిపేటలో డిగ్రీ విద్యార్థిని..

జోగిపేట రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ ఫెయిల్ అవుతాననే భయంతో మనస్తాపానికి గురైన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన అందోల్ మండల పరిధిలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. జోగిపేట పట్టణానికి చెందిన ఫరియా(18) డిగ్రీ చదువుతుంది. డిగ్రీ సప్లమెంటరీ పరీక్షను రాయగా, అందులోనూ ఫెయిల్ అవుతానని మనస్తాపానికి గురైంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నది. గమనించిన కుటుంబసభ్యులు ఫరియాను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. ఫరియా తండ్రి ఫరిదొద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

మామిడి తోటలో వ్యక్తి అనుమానాస్పద మృతి

జోగిపేట రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన అందోల్ మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో చోటుచేసుకున్నది. సీఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు... పుల్‌కల్ మండలం సింగూరు గ్రామానికి చెందిన ఖాదిరాబాద్ సురేష్ పోతిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో ఉన్న మామిడి తోటను కౌలుకు తీసుకున్నాడు. బుధవారం రాత్రి తోటకు నీరు పెడుతనానని వెళ్లిన సురేష్ తిరిగి రాలేదు. గురువారం ఉదయం సురేష్ భార్య శిరిష వెళ్లి చూడగా తోటలో మృతిచెంది కనిపించాడు. భార్య ఫిర్యాదుతో పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వెల్దుర్తి, మే1 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన ఘటన గురువారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నది. ఎస్‌ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ధర్మారం శివారులోని అడివిలో గుర్తుతెలియని (55-60 ఏళ్ల వయస్సు) వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆ వ్యక్తి ఎరుపు రంగు బనియన్, నలుపు రంగు ప్యాంటు వేసుకుని ఉన్నాడు. కూడి చేతిపై ఇటికె అంజయ్య అనే పేరు గల పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతిదేహాన్ని తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గజ్వేల్ రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన ఘటన గజ్వేల్‌లో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన గంగమణి(42) గజ్వేల్‌లోని సెయింట్ జోసెఫ్ స్కూల్, చర్చిలో పది నెలల నుంచి స్వీపర్‌గా పనిచేస్తుంది. గత నెల 26న చర్చిలో చెత్త ఊడ్చి దహనం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు గంగమణి చీర అంటుకుంది. అక్కడున్నవారు మంటలను ఆర్పి, గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. బుధవారం రాత్రి పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రౌడీయిజం చేస్తే కఠిన చర్యలు : సీఐ



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ విద్యాసాగర్

సిద్దిపేట అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): రౌడీయిజం, గుండాయిజం చేస్తే చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ విద్యాసాగర్ అన్నారు. ఆయా కేసుల్లో జైలుకెళ్లిన, హిస్టరీ షీట్స్ ఉన్నవారికి గురువారం సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నేర ప్రవృత్తి ప్రవర్తనను బట్టి హిస్టరీ షీట్స్ తొలగిస్తున్నామని, సత్ప్రవర్తనతో మెలిగి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ చంద్రయ్య, సిబ్బంది నరేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత



చేర్యాలలో చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కిరణ్‌కుమార్

చేర్యాల/తొగుట, మే 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల ప్రాంతానికి చెందిన 24మందికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ గురువారం అందజేశారు. స్థానిక షాదీఖానాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.10లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు.

● తొగుట మండలం వెంకట్రావ్‌పేట గ్రామంలో కోహెడ సాగర్‌కి మంజూరైన రూ.34 వేల సీఎం సహాయ నిధి చెక్కును దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. అంతకుముందు ఎల్ బంజర్‌పల్లి గ్రామంలో తాగునీటి ట్యాంక్ కు నీటి సరఫరాకు సొంత డబ్బులతో 800 మీటర్ల పైపును అందజేశారు.

వాలీబాల్ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం



వాలీబాల్ క్రీడాకారులతో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్, మే (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో గురువారం సాయంత్రం వాలీబాల్ వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చెర్మన్ కేడం లింగమూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, క్రీడల ఇన్‌చార్జి వెన్న రాజు, కోచ్‌లు క్రిష్ణ, రాకేష్, కొడముంజ మహేందర్, ఎండి హసన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పోతారం(ఎస్) కబడ్డీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు.

● రాయపోల్, మే 1 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌లో వాలీబాల్ వేసవి ఉచిత శిక్షణా శిబిరాన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి కిష్టారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కోచ్ కనకయ్య, వాలీబాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో కూలీల సంఖ్య పెంచాలి

● డీఆర్‌డీవో జయదేవ్ ఆర్యా



ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమైన డీఆర్‌డీవో

మద్దూరు, మే 1 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పనికి కూలీలు ఎక్కువగా హాజరయ్యేలా చూడాలని డీఆర్‌డీవో జయ్‌దేవ్ ఆర్యా సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశంలో నిర్వహించి పలు సూచనలు చేశారు. పని ప్రదేశంలో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారా లేదా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాంమోహన్, ఈసీ పరశురాములు, టీఏ వెంకటమ్మ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



కోహెడ మండలంలోని శ్రీరాములపల్లి జడ్పీఎస్ఎస్ 2009-10 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అప్పటి గురువులను శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను బహూకరించారు.

- కోహెడ, మే 1 (ఆంధ్రజ్యోతి)

'పది' ఫలితాల్లో ఐనాపూర్

● జడ్పీఎస్ఎస్‌లో మండలంలోనే అతితక్కువ ఉత్తీర్ణత శాతం నమోదు

● మౌలికవసతుల కల్పనకు విద్యాశాఖ డైరెక్టర్ చేయూతనిచ్చినా తప్పని నిరాశ



ఐనాపూర్ జడ్పీఎస్ఎస్

చేర్యాల, మే1 (ఆంధ్రజ్యోతి) : పదోతరగతి వార్షిక ఫలితాల్లో కొమురవెల్లి మండలంలోని ఐనాపూర్ జడ్పీఎస్ఎస్ విద్యార్థిని మండల టాపర్‌గా నిలిచినప్పటికీ మండలంలోనే అతితక్కువ ఉత్తీర్ణత శాతం నమోదైంది. మండలంలోనే ప్రధాన గ్రామం కావడంతో పాటు గతంలో మెరుగైన ఫలితాలు సాధించినప్పటికీ ప్రస్తుతం చతికిలబడింది. ఏకంగా పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ పాఠశాలలో మౌలిక వసతులకల్పనకు తోడ్పాటునందించినా, ఉపాధ్యాయుల వైఫల్యమో.. విద్యార్థుల నిర్లక్ష్యమో గానీ నిరాశ ఎదురైంది.

వసతులు కల్పించినా..

కొమురవెల్లి మండలంలో 11గ్రామాలు ఉండగా, ఐనాపూర్, మర్రిముస్త్యాల, కొమురవెల్లి, గురువన్నపేట జడ్పీఎస్ఎస్‌తో పాటు, కస్తూర్బా పాఠశాలలున్నాయి. పదవతరగతి ఫలితాల్లో కేజీబీవీ 88.38 శాతం, గురువన్న పేట జడ్పీఎస్ఎస్ 93.11, కొమురవెల్లి జడ్పీఎస్ఎస్ 78.34, మర్రిముస్త్యాల జడ్పీఎస్ఎస్ 76.2, ఐనాపూర్ జడ్పీఎస్ఎస్ 65.72శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇతర పాఠశాలలకు భిన్నంగా ఐనాపూర్ జడ్పీఎస్ఎస్‌కు విద్యాశాఖ డైరెక్టర్ వెంకటనర్సింహారెడ్డి కొన్నినెలల క్రితం పాఠశాలలో మౌలికవసతుల కల్పనకు చర్యలు తీసుకున్నారు. ప్రహరీ, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుతో పాటు భవనానికి రంగులు వేయించి సొబగులద్దించారు. బోధన విషయంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డి విభిన్న ప్రకటనలు చేశారు. కానీ విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉదాసీనంగా వ్యవహరించడంతో ఫలితాలలో తుస్సుమన్నారు. పాఠశాలలో 35మంది విద్యార్థులుండగా 23మంది మాత్రమే పాసయ్యారు. దీంతో స్థానికులు డోలాయమానంలో పడి భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండగా, ఎం.తేజస్విని 561మార్కులు సాధించి పాఠశాల పరువుకాస్త నిలబెట్టడం గమనార్హం.

'కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకం'

● కులగణన ప్రకటనపై బీజేపీ నేతల హర్షం

● మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



గజ్వేల్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, మే 1(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గర్నెపల్లి కృష్ణమూర్తి అన్నారు. గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ పట్టణాధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్‌తో కలసి గురువారం(ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడం హర్షణీయమన్నారు. ఈ నిర్ణయంతో బీసీలకు జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచడంతో విద్య, ఉద్యోగాలు, రాజకీయంగా అవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షడు నత్తి శివకుమార్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్యాల శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సుమతి, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

స్థానిక సంస్థల ఎన్నికలకు బీజేపీ కార్యకర్తలు సంసిద్ధం కావాలని రాష్ట్ర బీజేపీ నాయకుడు పూదరి నందన్‌గౌడ్ పిలుపునిచ్చారు. గజ్వేల్ మండల పరిధిలోని పిడిచెడ్ గ్రామంలో బీజేపీ క్రియాశీల కార్యకర్తల మండల సమావేశాన్ని గురువారం మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్త జనగణనతో పాటు కులగణన చేయాలన్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కోకన్వీనర్ ఎల్కంటి సురేశ్, బండారి మహేశ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

● చేర్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి) :దేశవ్యాప్త జన, కులగణన చేపట్టనున్నట్లు కేంద్రప్రభుత్వం వెల్లడించడంపట్ల హర్షం వ్యక్తం చేస్తూ కొమురవెల్లి గ్రామ బీజేపీ నాయకులు గురువారం మల్లన్న ఆలయ రాజగోపుర ఆవరణలో ప్రధాని నరేంద్రమోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు కార్యక్రమంలో నాయకులు స్వాములపల్లి భిక్షపతి, కుడికుడి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మహిళా యోగా శిక్షణ ప్రారంభం



యోగా సాధన చేస్తున్న మహిళలు

సిద్దిపేట కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట వ్యాస మహర్షి యోగా సెంటర్‌లో గురువారం ఉచిత మహిళా యోగా శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. భారత్ స్వాభిమాన్ ట్రస్ట్, వ్యాస మహర్షి యోగా సొసైటీ ఆధ్వర్యంలో ఈ శిక్షణను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ సిద్దిపేట జిల్లా ప్రభారి, జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట అశోక్, వ్యాస మహర్షి యోగా సొసైటీ అధ్యక్షుడు నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి , తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, ప్రముఖ యోగా గురువు తోట సతీష్ , వ్యాస మహర్షి యోగా సెంటర్ డైరెక్టర్ తోట సంధ్య పాల్గొని మాట్లాడారు. మానసిక, శారీరక దృఢత్వానికి యోగా చక్కటి సాధనమని తెలిపారు. ఈ శిక్షణ శిబిరంలో యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం, అమృత ఆహారం, ప్రతికూల భావనలను తొలగించి అనుకూల భావనలను పెంపొందించుకునే అంశాలపై శిక్షణ ఉంటుందని వివరించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 నుంచి 7 వరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గణేష్ నగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు రాజేశం, రాఘవపూర్ ప్రధానోపాధ్యాయులు మంజు భార్గవి , యోగా అసోసియేషన్ సభ్యులు విదిష, నందిని, విజయ, వాణి పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దశల వారీగా బిల్లులు మంజూరు

● అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

బెజ్జంకి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు దశల వారీగా బిల్లులు ప్రభుత్వం మంజూరు చేస్తుందని అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన బెజ్జంకి మండలంలోని వీరాపూర్‌లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను గురువారం ఆమె పరిశీలించారు. లబ్ధిదారులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. గ్రామంలో 77 మందికి ఇండ్లు మంజూరు కాగా 33 మంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను పనులు చేపట్టినట్లు గుర్తించారు. 8 మంది లబ్ధిదారులకు మొదటి దశలో బిల్లులు మంజూరైనట్లు తెలిపారు. ఇంటి నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ బిల్లులు రావడం లేదని పలువురు లబ్ధిదారులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె మాట్లాడుతూ బిల్లులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బిల్లులను ప్రభుత్వం నుంచి త్వరలో మంజూరవుతాయని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం ఇంటి నిర్మాణం చేసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రభుత్వం ఉచితంగా ఇసుక సరఫరా చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ దామోదర్ రెడ్డి, ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో మంజుల, పంచాయతీ రాజ్ ఏఈ సమ్మయ్య, ఏపీఎం నర్సయ్య, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నవ వధువుకు పుస్తె మట్టెలు అందజేత

కుకునూరుపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): ముద్దాపూర్ గ్రామానికి చెందిన నవ వధువుకి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి పుస్తెమట్టెలు అందజేశారు. గురువారం ముద్దాపూర్ గ్రామానికి చెందిన వడ్లకొండ యాదమ్మ, సత్తయ్యల కుమార్తె అంజలి వివాహానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తూం శ్రీకాంత్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి పుస్తెమట్టెలు అందజేశారు. తన వంతు సహాయ సహకారాలు పేదలకు ఎల్లవేళలా ఉంటాయని ఆయన తెలిపారు.

దుద్దెడ అభ్యుదయ యూత్ కార్యవర్గం ఎన్నిక

కొండపాక, మే 1 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దుద్దెడలో అభ్యుదయ యూత్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవ అధ్యక్షులు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, రామ్మోహన్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వేణు, ప్రధాన కార్యదర్శిగా సాయియాదవ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కోశాధికారిగా చంద్రం, కార్యదర్శులుగా శ్రీనివాస్, చిరంజీవి, కార్యవర్గ సభ్యులుగా రాజు, అమరేందర్‌రెడ్డి ఎన్నికయ్యారు.

పోచమ్మతల్లికి ప్రత్యేక పూజలు

సిద్దిపేటరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి) : పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డిపల్లి గ్రామంలో పోచమ్మతల్లి తృతీయ వార్షికోత్సవం సందర్భంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్సీ కులస్తులు మినీ ఫంక్షన్‌హాల్, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజురుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరగా సానుకులంగా స్పందించారు. క్యార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గరిపల్లి రాములు, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు కోదాది రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజల హరికృష్ణకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేస్తున్న గ్రామస్థులు



పురస్కారాన్ని అందుకుంటున్న తుమ్మ లక్ష్మీనారాయణ

బీడీ కార్మిక నేతకు శ్రమశక్తి పురస్కారం

దుబ్బాక, మే1(ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణానికి చెందిన బీడీ కార్మిక సంఘం (ఐఎన్‌టీయూసీ) నాయకుడు తుమ్మ లక్ష్మీనారాయణకు శ్రమశక్తి పురస్కారం లభించింది. గురువారం మేడే సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పురస్కారాన్ని అందుకున్నారు.

9 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో 9 మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొన్నారు. వారిని గురువారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసిన ఆయన 9 మందికి రూ.15,500 జరిమానా విధించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

చేర్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించారు. ఎంపీడీవో మహబూబ్ అలీ దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తోళ్ల రాజేశ్వరి, నాయకులు అందె నాని బాబు, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి

సిద్దిపేట అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి) : మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని తెలంగాణ దళిత సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల చంద్రం అన్నారు. గురువారం ఆయన గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడారు. తక్షణమే మావోయిస్టులను కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు ఆహ్వానించాలని కోరారు.

మల్లన్న ఆలయ పారిశుధ్య కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న వీరశైవసమాజం మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్

చేర్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని కొమురవెల్లి మండల వీర శైవస మాజం ఆధ్వర్యంలో గురువారం మల్లికార్జునస్వామి దేవాలయ సఫాయి కార్మికులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులకు శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వీరశైవ సమాజం మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ మాట్లాడుతూ ఆలయ పారిశుధ్య నిర్వహణలో సఫాయి కార్మికుల కృషి అభినందించదగిందన్నారు. సమసమాజస్థాపనకు పాటుపడిన మహాత్మా బసవేశ్వర ఆశయసాధనకు కృషిచేయాలని పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు మాతృ వియోగం

హుస్నాబాద్‌రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందుకు మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి బంక ఉప్పలవ్వ గురువారం సాయంత్రం మృతి చెందింది. దీంతో బంక చందును పలువురు నాయకులు పరామర్శించారు.

'రెవెన్యూ' లీలలు

5వ పేజీ తరువాయి..

ఇక ప్రత్యేక డ్రైవ్‌లో పలువురు రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సందెట్లో సడేమియాలాగా తమ చేతివాటాన్ని ప్రదర్శించేందుకు అవకాశం దొరికింది. పెద్ద పెద్ద భవనాలకు, షాపింగ్ మాల్‌కు ఆస్తిపన్ను పెంచే ప్రక్రియలో పలు భవనాల యజమానుల వద్దకు వెళ్లి ప్రస్తుతం ఆస్తిపన్ను చెల్లిస్తున్న దానికి సవరించిన పన్నుతో రెట్టింపు వస్తున్నట్లు చెప్పడంతో భయపడి ఖంగుతిన్న యజమానులు తమకు తెలిసిన పలువురు నాయకుల వద్దకు పరుగులు తీశారు. అక్కడ వారికి నిరాశ కావడంతో, పలువురు యజమానులు, కిందస్థాయి సిబ్బందైన పలువురు బిల్లు కలెక్టర్లను ఆశ్రయించడంతో అసలు తతంగం మొదలైంది. ఆస్తిపన్ను తగ్గించేందుకు డబ్బులిస్తే ఇప్పుడున్న పన్ను కంటే తక్కువగా చేస్తామని చెప్పడం, వారితో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు యజమానులు డబ్బులివ్వడంతో, మూకుమ్మడిగా టీంగా ఏర్పడి చాలా భవనాలకు ఆస్తిపన్ను ను తక్కువగా చేశారు. ఇలా వచ్చిన లక్షలాది డబ్బులను కింది స్థాయి నుంచి మొదలుకొని ఉన్నతా అధికారుల వరకు వాటాలుగా పంచుకుంటున్నట్లు మున్సిపల్ వర్గాలు కోడై కూస్తున్నాయి.

చర్యలు తీసుకోవాలి



నూతనంగా ఇల్లు పర్మిషన్ కావాలన్న, కట్టిన ఇంటికి నంబర్ కావాలన్నా రెవెన్యూ అధికారులకు భారీగా కాసులు సమర్పించాల్సిందే. రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని కమర్షియల్ నిర్మించిన వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. కమర్షియల్‌కు సంబంధించి ఆస్తిపన్ను విధించడంలో పలువురు మున్సిపల్ రెవెన్యూ అధికారులు, సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు. అవినీతికి పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఉదర మణిదీప్‌రెడ్డి, స్థానికుడు



గజ్వేల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు



ధూళిమిట్ట : జాలపల్లిలో జెండాను ఎగురవేస్తున్న నేతలు



చిన్నకోడూరులో జెండాను ఎగురవేస్తున్న కార్మిక నేతలు



సిద్దిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఘనంగా మే డే

జిల్లావ్యాప్తంగా గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం(మేడే)ను కార్మికులు ఘనంగా జరుపుకొన్నారు. ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పలుచోట్ల భారీ ర్యాలీ నిర్వహించారు. కార్మిక జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ కార్మిక, కర్షక రాజ్యం కోసం కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

-న్యూస్ నెట్‌వర్క్, మే 1 (ఆంధ్రజ్యోతి)



హుస్నాబాద్‌రూరల్ : పందిల్లలో..